

క్రీడాకారులకు సహకరిస్తాం

క్రీడల్లో రాణించే వారికి సహకారం అందిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు.

- 8లో ▸



కొండెక్కిన 'కొబ్బరి' ధరలు

కొబ్బరికాయలు, ఎండు కొబ్బరి ధరలు భారీగా పెరిగాయి. ఒక్క కాయను రూ.25కు విక్రయిస్తున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.1 /23.2

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఆల్ టైం రికార్డుకు చేరిన బంగారం!

- 10 గ్రాములకు రూ.78,300

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బంగారం ధరలు ఆకాశాన్నంటాయి. గురువారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.78,300 లకు చేరింది. ఇది ఆల్‌టైం రికార్డుగా బులియన్ వర్గాలు పేర్కొంటున్నాయి. వారం పది రోజులుగా బంగారం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. వచ్చేనెలలో శుభ ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు, ఫంక్షన్ల కోసం బంగారు ఆభరణాలు చేయించాలనుకున్న వారు ధరలను చూసి బెంబేలెత్తిపోతున్నారు. ఎన్నడూ లేనంతగా బంగారం ధరలు పెరగడంతో సామాన్యులు కొనలేని పరిస్థితికి చేరింది. పెరుగుతున్న ధరలతో మార్కెట్‌లో అమ్మకాలు కూడా తగ్గిపోయాయి. ఆభరణాలు తయారుచేసే స్వర్ణకారులు పెరిగిన ధరలతో పనులు లేకుండాపోతాయని ఆందోళన చెందుతున్నారు.

చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవాలి



కామారెడ్డి రూరల్: చీడపీడల నుంచి పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. గురువారం జిల్లాలోని పలు గ్రామాల్లో ఆయన రుద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వరి పొట్ట దశ నుంచి గింజ పాలు పోసుకునే దశలో ఉందన్నారు. వరిలో సుడి దోమ, అగ్గి తెగులు, ఎండాకు తెగులు, కంకి నల్లి ఆశిస్తున్నట్లు తెలిపారు. వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. రైతులు ఏఈవోలను సంప్రదించి వారు సూచించిన మందులనే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అపర్ణ, ఏవోలు పవన్ కుమార్, రాధ, శ్రీనివాస్‌రావు, రుద్రూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు నరేందర్, కృష్ణ చైతన్య, ద్వివశ్రీ, మేఘలత పాల్గొన్నారు.

నేడు నాగన్నగారి బావి వద్ద పర్యాటక దినోత్సవం



లింగంపేట: లింగంపేటలోని నాగన్నగారి మెట్ల బావి వద్ద శుక్రవారం పర్యాటక దినోత్సవ సంబురాలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో సురేందర్ తెలిపారు. గురువారం ఆయన లింగంపేటలోని నాగన్నగారి మెట్ల బావిని సందర్శించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నాగన్నగారి బావి వద్ద ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే మండల కేంద్రంలోని రామాలయం, నగరేశ్వర ఆలయం వద్ద గాలికి ఊగే ధ్వజస్తంభం, జోగినాథుని ఆలయాలను కలెక్టర్ సందర్శించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో నరేష్, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీవో మలహరి, కార్యదర్శి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

రేపు జిల్లా స్థాయి ఖో ఖో ఎంపికలు

కామారెడ్డి టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా అండర్- 14, 17 బాల, బాలికల ఖో ఖో టోర్నమెంట్ కం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి హీరాలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ (బాయ్స్)లో పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని క్రీడాకారులు ఒరిజినల్ బోనాఫైడ్ సర్టిఫికెట్‌తో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం 9490015388 నంబర్‌ను సంప్రదించాలన్నారు.


వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ

కామారెడ్డి టౌన్: సెట్విన్ టెక్నికల్ శిక్షణ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు టీటీఐ జిల్లా కోఆర్డినేటర్ మోయిజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ కోర్సులలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు కోర్సు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామన్నారు. వివరాలకు 7386180456, 7989159121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమాల సర్దుబాటు!

- ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు
- అవసరం ఉన్న చోటుకి కాకుండా కావాల్సిన ప్రాంతానికి వెళ్తున్న వైనం
- తాజాగా ప్రభుత్వ ఉత్తర్వులతో మరోసారి అక్రమాలకు తెర లేపిన పలువురు
- కలెక్టర్ దృష్టి సారిస్తేనే అడ్డుకట్టపడేది

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లా విద్యాశాఖ అక్రమాలకు కేరాఫ్‌గా మారింది. సర్దుబాటు పేరుతో అక్రమ డిప్యుటేషన్లు చేపట్టి కొందరు అధికారులు జేబులు నింపుకుంటున్నారు. ఉపాధ్యాయులు అవసరం ఉన్న పాఠశాలకు మండల పరిధిలోనే డిప్యుటేషన్ వేయాలన్న ఆదేశాలు ఇక్కడ అమలు కావడం లేదు. నిబంధనల ప్రకారం కొందరిని సర్దుబాటు చేసి, మిగతా వారికి ఇష్టారాజ్యంగా డిప్యుటేషన్ వేస్తున్నారు. లింగంపేట మండలంలో పనిచేసే నలుగు రైదుగురు ఉపాధ్యాయులను సర్దుబాటు పేరుతో కామారెడ్డి పట్టణం, బీబీపేట, భిక్కనూరు ప్రాంతాలకు పంపించారు. జుక్కల్ మండలంలో పనిచేసే ఉపాధ్యాయుడిని ఎల్లారెడ్డి పంపించారు. గతంలో పనిచేసిన కలెక్టర్‌ను బుకాయించి అక్రమంగా డిప్యుటేషన్లు వేశారు. ఇప్పటికీ చాలా మంది ఉపాధ్యాయులు తమ పోస్టింగ్ ప్రాంతంలో కాకుండా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 40 మందికి పైగా ఉపాధ్యాయులు డిప్యుటేషన్లపై ఉండగా, అందులో చాలా మంది నిబంధనలకు విరుద్ధంగానే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా అవసరం ఉన్న చోటుకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు మరోసారి అక్రమాల పండుగ చేసుకోనున్నారు. ఇటీవల ప్రమోషన్లు పొందిన చాలా మంది ఉపాధ్యాయులకు దగ్గరి ప్రాంతాల్లో ఖాళీలు లేకపోవడంతో దూర ప్రాంతాలను ఎంచుకున్నారు. ఇప్పుడు సర్దుబాటు వారికి వరంగా మారనుంది. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న జుక్కల్, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, మద్నూర్, పిట్లం, తదితర మండలాలకు బదిలీపై వెళ్లిన చాలా మంది ఉపాధ్యాయులు సర్దుబాటు పేరుతో జిల్లా కేంద్రానికి చుట్టుపక్కల మండలాలకు రావడానికి విద్యాశాఖ అధికారులతో బేరసారాలు సాగిస్తున్నట్లు ప్రచారం జోరందుకుంది.



ఎమ్మెల్యేలకు మస్కా

సర్దుబాట్లకు సంబంధించి పూర్తి సమాచారాన్ని విద్యాశాఖ అధికారులు ఎమ్మెల్యేలకు ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఆయా నియోజక వర్గాల నుంచి టీచర్లను ఇతర నియోజక వర్గాలకు పంపారని తెలిస్తే వారు అధికారులను నిలదీసే పరిస్థితి ఉంటుంది. అయితే అంతా నోటి మాట మీదనే డిప్యుటేషన్లు నడిపిస్తున్నారు. దీంతో విషయం బయట పడడం లేదు. ఎమ్మెల్యేలకు తెలిసి ఒక వేళ గట్టిగా అడిగితే ఏదో సాకుచెప్పి తప్పించుకోవచ్చనేది వారి ధీమాగా కనబడుతోంది. ఈ సారి సర్దుబాట్లలో కూడా అక్రమాలు పెద్ద ఎత్తున జరిగే అవకాశాలు కనబడుతున్నాయి.

విచారణ చేపట్టాలి

ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్ వ్యవహారంపై కలెక్టర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సర్దుబాటు చేసిన ఉపాధ్యాయుల సంఖ్యను, వివరాలను తక్కువగా చేసి చూపించడం ద్వారా అధికారులకు తెలియకుండా విద్యాశాఖ అధికారులు జాగ్రత్త పడుతున్నారు. ప్రస్తుతం విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్దుబాటు చేయడానికి కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే సర్దుబాటు చేసిన టీచర్ల వివరాలను తీసుకుని, అక్రమ డిప్యుటేషన్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అక్రమ డిప్యుటేషన్లను అరికట్టకుంటే మరిన్ని జరిగే అవకాశం ఉంది.

పైరవీలతో..

విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఉన్న పాఠశాలకు అదే మండలంలో విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాల నుంచి సంబంధిత సబ్జెక్టు బోధించగలిగే ఉపాధ్యాయుడితో సర్దుబాటు చేయాలి. అయితే కొందరు సర్దుబాటు అర్థాన్ని మార్చేశారు. పైరవీలు, పైసలతో దూర ప్రాంతాల్లో విద్యార్థులు ఉన్న బడి నుంచి టీచర్లను తీసి, అనుకూలమైన స్కూళ్లకు పంపుతున్నారు. కొందరు టీచర్లు హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. బదిలీలు, ప్రమోషన్లలో వారికి గాంధారి, లింగంపేట, తాడ్వాయి, ఎల్లారెడ్డి, పిట్లం, పెద్దకొడప్‌గల్, జుక్కల్ తదితర ప్రాంతాల్లోని పాఠశాలలకు తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వచ్చింది. అయితే వారు ఇప్పుడు మాముళ్లు ముట్టజెప్పి డిప్యుటేషన్లు వేయించుకోవడానికి యత్నిస్తున్నారు. దీనికి ఉపాధ్యాయ సంఘాల నాయకులే మధ్యవర్తిత్వం వహిస్తారనే విమర్శలు ఉన్నాయి.

అవసరం మేరకే సర్దుబాట్లు

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు టీచర్లను సర్దుబాటు చేశాం. ఇతర మండలాల నుంచి వేరే ప్రాంతాలకు ఒకరిద్దరిని ప్రత్యేక పరిస్థితుల్లో చేసి ఉండొచ్చు. ప్రస్తుతం కూడా అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా సర్దుబాట్లు చేస్తాం.

– ఎస్ రాజు, డీఈవో

అరెస్టుల పర్వం



కామారెడ్డిలోని జీవదాన్ పాఠశాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

- పోలీసులపై రాళ్ల దాడి ఘటనలో పలు సెక్షన్‌ల కింద కేసులు
- ఇప్పటికే పలువురి అరెస్టు
- దాడులకు పాల్పడిన మరికొందరిని గుర్తించే పనిలో పోలీసులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణంలో జీవదాన్ పాఠశాల వద్ద పోలీసులపై రాళ్ల దాడి ఘటనలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ఆరేళ్ల చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ పీఈటీ ఉదంతం కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు నిరసనగా చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారి పోలీసులపై రాళ్ల దాడి జరగడంతో ఈ విషయాన్ని పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. పాఠశాల ఆస్తుల ధ్వంసం, పోలీసులపై దాడులకు సంబంధించి భారత న్యాయ సంహిత సెక్షన్ 189(2), 221(2), 193, 126(2), 324(4), 190 సెక్షన్‌ల కింద కేసులను నమోదు చేశారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించడంతో పాటు ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరికొందరిని గుర్తించే పనిలో ఉన్నారు. పట్టణంలో భారీ పోలీస్ బందోబస్తు కూడా కొనసాగుతోంది.

కొనసాగుతున్న బందోబస్తు

జీవదాన్ పాఠశాల ఘటన నేపథ్యంలో మూడు రోజులుగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన భారీ బందోబస్తు ఇంకా కొనసాగుతోంది. దాదాపు మూడు జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. జీవదాన్ పాఠశాలతోపాటు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలు, రద్దీ ప్రాంతాలు, అవసరమైన ఇతర అన్ని చోట్ల పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. దాదాపు 300 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొనడంతోపాటు అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు తెలుస్తుంది. గురువారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలకు ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు అక్కడ భారీగా పోలీసులు మోహరించారు.

పరారీలో పలువురు

జీవదాన్ పాఠశాలలో జరిగిన ఘటన విషయంలో అదే రోజు నుంచి దాడులు చేసిన వారిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. దాంతో పాటు పట్టణంలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులను కట్టడి చేయడంపై దృష్టి పెట్టారు. ఇందుకోసం అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. మత పెద్దలు, విద్యార్థి సంఘాలు, ప్రజాప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు ఏర్పాటు చేసి సామరస్యంగా ముందుకు నడవాలని అవగాహన కల్పించారు. సీసీ పుటేజీలు, వీడియోలు పరిశీలించి దాడులు చేసిన వారినిలో ఇప్పటి వరకు 30 మందిని గుర్తించినట్లు తెలిసింది. వారిలో బుధవారం ఆరుగురి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గురువారం అరెస్టుల పర్వం కొనసాగింది. దాదాపు 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరి కొందరు కామారెడ్డిని వదిలి పరారీలో ఉన్నట్లు తెలుస్తుంది.

వీరనారి చాకలి ఐలమ్మ



ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్, కలెక్టర్ సంగ్వాన్

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి క్రైం: భూమి కోసం, భుక్తి కోసం పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని గురువారం ఆయన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఎదురుగా ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఆర్డీవో రంగనాథ్‌రావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, డీఎస్పీ నాగేశ్వర్ రావు, జెడ్పీ సీఈవో చందర్‌నాయక్ పాల్గొన్నారు.

యువకుడి ప్రాణం తీసిన గుంతలు

బిచ్కుంద(జుక్కల్) : బిచ్కుంద మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తా నుంచి కమ్మరి గుడి వరకు మెయిన్ రోడ్డు పై ఉన్న గుంతలతో గురువారం ఓ యువకుడి ప్రాణం పోయింది. బిచ్కుందకు చెందిన గణేశ్(25) బైక్‌పై బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తుండగా మున్నూరు కాపు సంఘం దగ్గర రోడ్డు పై ప్రమాదకరంగా ఏర్పడిన భారీ గుంతలో బైక్ పడి ఎదురుగా వస్తున్న లారీ వెనక చక్రాల కిందకు వెళ్లింది. గణేశ్ తల పై నుంచి లారీ టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గణేశ్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గణేశ్ మృతదేహం

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- వ్యవసాయ సలహాదారు పోచారం

బాన్సువాడ : మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక వృద్ధి సాధించాలని సూచించారు. జిల్లాలోనే మొదటిసారిగా బాన్సువాడలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పట్టణానికి చెందిన మయూరి ఏరియా లెవల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ కొనసాగుతుందని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో మరో నాలుగు క్యాంటీలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు ఖలేక్, నర్సింలు, ఎజాస్, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, నార్ల రవీందర్, క్యాంటీన్ నిర్వాహకులు పాల్గొన్నారు.



మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

'సాగర్'ను టూరిజం హబ్‌గా మారుస్తాం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: పర్యాటకానికి అనువుగా ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు కౌలాస్ కోటను టూరిజం హబ్‌గా మారుస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. పర్యాటక అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. గురువారం నిజాంసాగర్ ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ఎగువ నుంచి వస్తున్న వరద, దిగువకు గేట్ల ద్వారా వదులుతున్న నీటి వివరాలు తెలుసుకున్నారు. గుల్‌దస్తా వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువకు సిమెంట్ లైనింగ్‌కు రూ.459.5 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆ తర్వాత పాలకులు ఇప్పటి వరకు ప్రాజెక్టుకు చిల్లగవ్వ మంజూరు చేయలేదన్నారు. 500 ఎకరాల విస్తీర్ణం గల ప్రాజెక్టు పరిసరాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే జుక్కల్ నియోజకవర్గం టూరిజం కేంద్రంగా మారుతుందన్నారు. సంగారెడ్డి – నాందేడ్ జాతీయ రహదారితో పాటు బోధన్- హైదరాబాద్ మార్గంలో ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్ట్ దశను మారుస్తామని చెప్పారు. ప్రస్తుత సంవత్సరం జలాశయం ఆయకట్టు కింద రెండు పంటలకు సాగు నీటికి ఢోకా ఉండదన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో ప్రాజెక్టు ఉన్నా 4 వేల ఎకరాలకే సాగు నీరందిస్తుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ప్రాజెక్టుతో జుక్కల్ నియోజకవర్గానికి లబ్ధి చేకూరేలా చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. ప్రాజెక్టు వద్ద పర్యాటకులకు వసతులు కల్పించాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. నాయకులు ఎలే మల్లికార్జున్, పాట్రు కిశోర్, లక్ష్మయ్య, అనీస్, రాజాగౌడ్, రమేష్, నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.




నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి గురువారం 16 వేల క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా 21,500 క్యూసెక్కులు దిగువనకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం అంతే నీటి మట్టంతో నిండుకుండలా ఉంది.

కౌలాస్ ఒక గేటు ఎత్తివేత

కౌలాస్ ప్రాజెక్టులోకి గురువారం 100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా వస్తోందని ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రాజెక్టు ఒక గేటు ద్వారా 100 క్యూసెక్కుల నీటిని మంజీరలోకి వదులుతున్నామని చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్ల(1.237 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని చెప్పారు.



వరద గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

గడువు దాటితే చర్యలు



కామారెడ్డి క్రైం: గడువులోగా సీఎంఆర్ సరఫరా చేయని వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో పౌరసరఫరాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 30 లోగా సరఫరా చేయని పక్షంలో అపరాధ రుసుము విధించడంతో పాటు, వచ్చే వానాకాలంలో ధాన్యం కేటాయింపులు జరపమన్నారు. డిఫాల్ట్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం రాజేందర్, ఏఎస్‌వో నరసింహారావు పాల్గొన్నారు.

సొసైటీలో అవకతవకలపై రైతుల ఆగ్రహం



బీర్కూర్ సొసైటీ మహాజన సభలో కార్యదర్శిని నిలదీస్తున్న రైతులు

బాన్సువాడ: బీర్కూర్ సొసైటీలో భారీగా అవకతవకలు జరిగాయని, అందుకు కార్యదర్శి బాధ్యత వహించాలని రైతులు పట్టుబట్టారు. గురువారం బీర్కూర్ ప్రాథమిక సహకార సంఘం భవనంలో చైర్మన్ గాంధీ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. సొసైటీ ఆదాయ, ఖర్చుల వివరాలను కార్యదర్శి విఠల్ చదివి వినిపించారు. రైతులు ఖర్చులపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తప్పుడు లెక్కలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు విషయంలో వచ్చిన కమీషన్ లెక్కల్లో అవకతవకలు జరిగాయని కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీకి విక్రయించిన ధాన్యాన్ని కార్యదర్శికి అనుకూలంగా ఉండే రైస్‌మిల్లులకు పంపుతున్నారని, అక్కడ మిల్లర్లు తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శి విఠల్‌ను సస్పెండ్ చేయాలని రైతులు తీర్మానం చేశారు.

క్లుప్తంగా

సమాజాభివృద్ధికి కృషిచేయాలి



కామారెడ్డి టౌన్ : సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెయూ కో–ఆర్డినేటర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజాన్ని మార్చే శక్తి కేవలం వలంటీర్లకు మాత్రమే ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయ కుమార్ మాట్లాడుతూ వాలంటీర్లు సామాజిక సేవలో పాల్గొనడం వల్ల వ్యక్తిగతంగా నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాల శిబిరంలో పాల్గొన్న వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే కిష్టయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి. చంద్రశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

జీవో 25ను సవరించాలి



కామారెడ్డి టౌన్ : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 25ను తక్షణమే సవరణ చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం డీఈవో ఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ రాములు, కో–కన్వీనర్ స్వామి, నాయకులు సంతోష్, అనిల్, రాజేందర్, శ్రీధర్‌గౌడ్, అంజన్‌ప్రసాద్ తదితరులున్నారు.

30న ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ ఆర్చరీ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ ఆర్చరీ క్రీడకు సంబంధించి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు అండర్–14, 17 బాలబాలికల విభాగంలో ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి గురువారం తెలిపారు. మరిన్ని వివరాలకు 70369 15136 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి స్విమ్మింగ్ అండర్–11, 14, 17 బాలబాలికల విభాగంలో స్కేటింగ్ ఎంపికలు ఈ నెల 30న నగరంలోని సుభాష్‌నగర్‌లోని ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ ఆవరణలో ఎంపికలు ఉంటాయని క్రీడల కార్యదర్శి నాగమణి తెలిపారు. మరిన్ని వివరాలకు 8333947957 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మెమోను ఉపసంహరించుకోవాలి

కామారెడ్డి టౌన్ : జుక్కల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ వైద్యాధికారిపై కిందిస్థాయి అయిన తహసీల్దార్ జారీ చేసిన మెమోను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ ఆదేశాలతో ఒక తహసీల్దార్ స్థాయి అధికారి ఉన్నతమైన సివిల్ సర్జన్ సూపరింటెండెంట్ వైద్యాధికారికి మెమో ఇవ్వడానికి అర్హత లేదన్నారు. మెమో ఉపసంహరించకపోతే కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు.

గులాబీ రంగు పురుగు నుంచి కాపాడాలి

● వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ఘన్‌పూర్‌లో వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మద్నూర్(జుక్కల్) : పత్తి పంటకు ప్రస్తుతం కాయ ఎదుగుదల దశలో గులాబీ రంగు పురుగు ఆశించడానికి అవకాశం ఉందని రైతులు సకాలంలో మందులు పిచికారి చేసి కాపాడుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయ్ కుమార్ సూచించారు. మద్నూర్, డోంగ్లీ మండలాల్లోని మదన్‌హిప్పర్గా, కుర్లా, అవాల్‌గావ్ గ్రామ శివారులోని వరి, పత్తి పంటలలో క్షేత్రస్థాయి రోగనిర్ధారక సందర్శనలు నిర్వహించారు. పంటలో 10 చొప్పున లింగాకర్షణ బుట్టలు ముందస్తుగా అమర్చుకోవాలన్నారు. వరి పొలాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు, కంకి నల్లి అలాగే గింజమచ్చ తెగులుకు ప్లాంటమైసిన్ అనే మందును 0.4 గ్రాముల మందు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజు, విజయ్‌కుమార్, ఏవో రాజు తదితరులున్నారు.

మాచారెడ్డి : మండలంలోని ఘన్‌పూర్ గ్రామాన్ని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సందర్శించి పంట పొలాలను పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంటలలో చీడపీడల ఉధృతిని గుర్తించి పలు సలహాలు,సూచనలు ఇచ్చారు. ఆకు నల్లికి స్పైరోమెసిఫెన్ 1మిల్లీ లీటర్లు, బ్యాక్టీరియల్ లీఫ్ బ్లైట్ కు ప్లాంటమైసిన్ 0.5గ్రా లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్, ఏడీఏ అపర్ణ,మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.



అవాల్‌గావ్‌లో పత్తిని పరిశీలిస్తున్న అధికారులు



శివాయిపల్లిలో..

రాజంపేట : మండలంలోని శివాయిపల్లిలో జిల్లా వ్యవసాయ అధికారి తిరుమలప్రసాద్, రుద్రూరు వరి, చెరుకు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు నరేందర్ బృందం, కామారెడ్డి ఏడీఏ అపర్ణ వరి, ప్రత్తి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఏవో సునీతారాణి, రైతులు సుధాకర్ రెడ్డి తదితరులున్నారు.

కొండెక్కిన కొబ్బరికాయ ధరలు

● అమాంతం పెంచేసిన వ్యాపారులు
● ఒక్క కొబ్బరి కాయ రూ. 25 పైమాటే..



భిక్కనూరు : కొబ్బరికాయల ధరలు కొండెక్కాయి. దీంతో ఎండు కొబ్బరి ధర కూడా పెరిగిపోయింది. భారీ వర్షాలకు దేశవ్యాప్తంగా కొబ్బరి తోటలు దెబ్బతిన్నాయి. కొబ్బరి చెట్లు కూడా విరిగిపోయాయి. దీంతో కొబ్బరి పంట దెబ్బతిన్నది. కొబ్బరి తోటలు అధికంగా సీమాంధ్ర ప్రాంతంలోనే ఉన్నాయి. ఇటీవల వానలు బాగా కురియడం వరదలు రావడంతో కొబ్బరి పంట దెబ్బతిన్నది. దీంతో కొబ్బరికాయల ధరలకు రెక్కలు వచ్చాయి. మూడు రోజుల క్రితం వరకు ఒక్క కొబ్బరికాయ ధర హోల్‌సెల్‌గా రూ. 17 ఉండగా రిటైల్‌గా రూ. 20 ఉండేది. ఇప్పుడు హోల్‌సెల్‌గా ఒక కొబ్బరికాయ ధర రూ. 23లకు రిటైల్ గా రూ. 25 చేరుకుంది. శ్రావణ మాసంలో అత్యధికంగా కొబ్బరికాయల విక్రయాలు జరిగినప్పటికి ధరలు పెరుగలేదు. దేశవ్యాప్తంగా కొబ్బరి పంట దెబ్బతినడంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఆంధ్రాకు వచ్చి కొబ్బరికాయలు కొనుగోలు చేయడంతో కొబ్బరి కాయల ధరలకు రెక్కలొచ్చాయి. కొబ్బరికాయల ధరలు పెరగడంతో ఎండు కొబ్బరి ధర కూడా పెరిగింది. మూడు రోజుల క్రితం వరకు కిలో ఎండు కొబ్బరి ధర హోల్‌సెల్‌గా రూ. 130 ఉండగా రిటైల్‌లో రూ. 140 విక్రయించేవారు. ప్రస్తుతం ఎండు కొబ్బరి కిలో ధర హోల్‌సెల్‌గా రూ. 180కి చేరుకుంది. దీంతో వ్యాపారులు రిటైల్‌లో రూ. 190 చొపున విక్రయిస్తున్నారు. మరో రెండు మూడు రోజుల్లో కొబ్బరినూనే ధరలు కూడా పెరుగుతాయని వ్యాపారులు తెలిపారు. ఇప్పటివరకు రిటైల్ మార్కెట్‌లో కొబ్బరికాయ రూ. 25 ఎప్పుడు చేరుకోలేదని ఇప్పుడే మొట్టమొదటి సారిగా రూ. 25కు చేరుకుందని పలువురు వ్యాపారులు తెలిపారు. హిందువులకు పవిత్ర మాసమైన శ్రావణ మాసంలో కొబ్బరికాయల విక్రయం అధికంగా ఉన్నప్పటికి రూ. 20 దాటలేదు. ఇప్పుడు దేశవ్యాప్తంగా కొబ్బరితోటలు వానలకు దెబ్బతినడంతో ధర ఒకేసారి రికార్డు స్థాయికి చేరుకుంది.

క్రీడాకారులకు సహకరిస్తాం



గాంధారి(ఎల్లారెడ్డి) : క్రీడల్లో రాణించే వారికి పూర్తి సహకారం అందిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. గురువారం ఆయన పేట్‌సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మండల అంతర పాఠశాలల క్రీడాపోటీలను ప్రారంభించారు. క్రీడాభివృద్ధికే గాంధారి మండల కేంద్రానికి స్టేడియం మంజూరు చేయించానన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఖోఖో మీట్‌కు సోమారంపేట విద్యార్థులు



మాచారెడ్డి(కామారెడ్డి):మండలంలోని సోమవారంపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఖోఖో మీట్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం భాస్కర్ తెలిపారు. పదోతరగతి చదువుతున్న మధు, రిత్విక అండర్–17, 7వ తరగతి చదువుతున్న గీతాంజలి అండర్–14 విభాగంలో సెప్టెంబర్ 28న కామారెడ్డి జిల్లా ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఖోఖో మీట్ ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పోశెట్టి, స్వరూప రాణి, పీఈటీ సంధ్య క్రీడాకారులను అభినందించారు.

● మార్చ్‌పాస్ట్‌లో ఉత్తమ ప్రదర్శన



గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని పేట్‌సంగెం జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం మండల అంతర పాఠశాలల క్రీడా పోటీలను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ప్రారంభించారు. విద్యార్థుల మార్చ్‌పాస్ట్‌ను తిలకించారు. మార్చ్ ఫాస్ట్‌లో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రథమ స్థానంలో, గాంధారి జెడ్పీ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచాయి. వారికి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు.

● విద్యార్థులకు జిల్లాస్థాయి రోల్ ప్లే పోటీలు



కామారెడ్డి టౌన్ : రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) హైదరాబాద్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల దేవునిపల్లిలో విద్యార్థులకు జిల్లాస్థాయి రోల్ ప్లే పోటీలను నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దేవునిపల్లి, ద్వితీయ బహుమతిగా జెడ్పీహెచ్ఎస్ అడ్లూరు, తృతీయ బహుమతిగా మోడల్ స్కూల్ నిజాంసాగర్ గెలుచుకున్నారు. విజేతలకు కాంప్లెక్స్ నోడల్ అధికారి గంగా కిషన్ బహుమతులను అందజేశారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్, సునీత, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

క్రీడా సమాచారం

● జోనల్ స్థాయి అండర్ –14 కబడ్డీ టోర్నీ



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండల (జోన్) అండర్–14 బాలబాలికల కబడ్డీ టోర్నీని గర్గుల్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సెలెక్షన్ కమ్ టోర్నీలో ప్రోబెల్స్ పాఠశాల బాలుర విభాగంలో ప్రథమ స్థానం, గర్గుల్ పాఠశాల జెడ్పీహెచ్ఎస్ ద్వితీయ స్థానంలో, బాలికల విభాగంలో ఫస్ట్ ప్లేస్‌లో శిశు మందిర్, ద్వితీయ స్థానంలో ప్రొబెల్స్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 28న కామారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయిలో టోర్నీలో పాల్గొంటారని పీఈటీ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

● డివిజన్ స్థాయి కబడ్డీ టోర్నీ..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కబడ్డీ పోటీలు గురువారం సజ్జన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించినట్లు కన్వీనర్ రాజాగౌడ్ తెలిపారు. అండర్–14, అండర్–17 బాలుర రెండు జట్లు, బాలికలు రెండు జట్లు ఎంపిక చేశామన్నారు. హెచ్ఎం సాయన్న, సంగమేశ్వర్, రాజేందర్ పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో హత్య



నరహరి(ఫైల్)



మృతుడి బంధువులతో పోలీసులు



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

● కళ్లల్లో కారం చల్లి.. కర్రలతో కొట్టి
● కంజర్‌లో కలకలం రేపిన హత్య ఉదంతం
● పోలీస్ బందోబస్తు మధ్య అంత్యక్రియలు
● పోలీసుల కస్టడీలో హంతకులు..!

మోపాల్: మండలంలోని కంజర్‌లో బుధవారం అర్ధరాత్రి గాజ నరహరి(55) హత్య కలకలం రేపింది. పక్కా ప్రణాళిక ప్రకారం మృతుడి కోసం ప్రత్యర్థులు కాపు కాసి, కళ్లల్లో కారం చల్లి కర్రలతో కొట్టి నడిరోడ్డుపై హత్యచేశారు. విషయం తెలుసుకున్న సీఐ సురేష్‌కుమార్, ఎస్సై యాదగిరిగౌడ్ సహా పలువురు ఎస్సై గ్రామంలో పికెటింగ్ నిర్వహించారు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గాజ నరహరికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు గోవర్ధన్‌కు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోయిని లలితసత్యనారాయణ కుమార్తె వర్షతో గతంలో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. నాలుగు నెలల క్రితం భార్యాభర్తల మధ్య గొడవతో భార్య వర్ష ఆత్మహత్య చేసుకుంది. ఆ కేసులో నెలన్నర క్రితం వరకు గోవర్ధన్, నరహరి జైలులో ఉన్నారు. ఈక్రమంలో పిల్లలకు తండ్రి ఆస్తి ఇచ్చే విషయంలో ఇరు కుటుంబాల పంచాయితీ జరుగుతోంది. చర్చలు కొలిక్కి రాకపోవడానికి నరహరి కారణమని సత్యనారాయణ కుటుంబం నిర్ధారణకు వచ్చి ఆయన హత్య కు పథకం రచించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

నిమిషమైతే ఇంట్లోకి..

నరహరిని హత్య చేయాలని సత్యనారాయణ కుటుంబీకులు ప్రణాళిక చేశారు. ఆ మేరకు బుధవారం రాత్రి కొందరు నరహరి ఇంటికి వచ్చి పిలిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంట్లో భార్య మాత్రమే ఉన్నట్లు, కుమారుడు సైతం వేరే గ్రామానికి వెళ్లినట్లు నిర్ధారించుకున్నారు. నరహరి ప్రతి అడుగును గమనిస్తూ వచ్చారు. ఆయన నిమిషమైతే ఇంట్లోకి చేరుకుంటాడనుకునే సమయంలో అక్కడే ఉన్న సత్యనారాయణ కుటుంబానికి చెందిన మహిళలు ఒక్కసారిగా కళ్లల్లో కారం చల్లారు. అక్కడే కింద పడిపోయిన నరహరిని సత్యనారాయణ, ఆయన కొడుకు, మరికొందరు కర్రలతో తలపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నరహరిని కొడుతున్న విషయం ఆయన భార్య.. పెద్ద కొడుకు గోపికి సమాచారమివ్వగా ఆయన అక్కడికి చేరుకోగా ఆయనకూ కళ్లల్లో కారం చల్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. తన తండ్రిని హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని గోపి డిమాండ్‌చేశారు. అప్పటి వరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని భీష్మించారు. బాధితుల డిమాండ్లను పరిష్కరిస్తానని సీఐ హామీ ఇవ్వడంతో పోలీస్ బందోబస్తు మధ్య నరహరి అంత్యక్రియలు గురువారం ముగిశాయి.

నరహరిని హత్య చేసిన మాజీ సర్పంచ్ లలిత సత్యనారాయణ, పూజిత, బాలకృష్ణ, సందీప్, మహేశ్, వంశీతోపాటు మరికొందరిపై పోలీసులు హత్య కేసు నమోదుచేశారు. ప్రస్తుతం వారు పోలీస్ కస్టడీలో ఉన్నట్లు తెలిసింది.

హజ్గుల్ శివారులో అస్తిపంజరాలు లభ్యం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని హజ్గుల్ శివారులో గురువారం ఓ యువకుడి అస్తిపంజరం లభ్యమైందని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. బిహార్‌కు చెందిన మనీష్ కుమార్(18) హజ్గుల్‌కు చెందిన ఓ రైతు దగ్గర గేదెల షెడ్డులో పనిచేస్తున్నాడు. అదే గ్రామంలో వేరే వ్యక్తి వద్ద పనిచేస్తున్న మనీష్ స్నేహితుడు బిహా రీ నందకిశోర్ ఈ నెల 19న బయటకు వెళ్దామని మనీష్‌ను తీసుకెళ్లాడు. కొన్ని రోజులుగా మనీష్‌కు అతని అన్న సుభాష్ యాదవ్ ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. నందకిశోర్‌పై అనుమానం రావడంతో సుభాష్ హజ్గుల్‌కు వచ్చి విచారించాడు. గురువా రం హజ్గుల్ శివారులో వెతకడంతో మనీష్ అస్తిపంజరాలు లభ్యమయ్యాయి. అస్తిపంజరంపై ఉన్న టీషర్టు మనీష్‌గా గుర్తించారు. మృతుడి అన్న ఫిర్యా దు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



కన్నయ్య(ఫైల్)

నందిపేట్: మండల కేంద్రంలోని రాజ్‌నగర్ దుబ్బ ప్రాంతానికి చెందిన పత్రిక కన్నయ్య(35) చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై హరిబాబు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కన్నయ్య బుధవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంటి నుంచి పనికి వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం స్థానికుల సమాచారం మేరకు ఊర చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కన్నయ్య నిమజ్జనం జరిగిన గణేశ్ విగ్రహాల ఇనుప చువ్వల కోసం చెరువులో వెతుకుతుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెంది ఉంటాడని పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కాలువలో జారిపడి ఒకరు..

ఖలీల్‌వాడి: ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని బోర్గాం(పి)లో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మిర్చి కంపౌండ్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎర్రం అంజయ్య మూత్ర విసర్జన సమయంలో కాలువలో జారిపడి నీట మునిగి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మూర్చ వ్యాధితో యువకుడు..



మహేశ్(ఫైల్)

మాక్లూర్: మూర్చ వ్యాధితో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మాక్లూర్ మండలంలోని కల్లెడి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రంగం మహేశ్ అలియాస్ లారా(33) గ్రామంలో చికెన్ సెంటర్ నడుపుతూ, వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతను మూర్చ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం ఇంట్లో చిన్నగొడవ జరిగితో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం వ్యవసాయ పొలంలో వెతుకగా మహేశ్ విగతజీవిగా కనిపించాడు. కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పొలంలో ఉన్న సమయంలో మూర్చవ్యాధి రావడంతో మృతి చెందాడన్నారు. మృతుడి భార్య శరణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హత్యకేసులో నిందితురాలికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు గురువారం తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దకొడప్‌గల్‌లోని కాస్లాపూర్‌నకు చెందిన తడకంటి సాయిలు(55) 2022జూన్10న హత్యకు గురయ్యాడు. డబ్బుల విషయంలో తరచ భార్యతో గొడవపడేవాడు. పెద్ద మనుషుల సమక్షంలో నచ్చజెప్పినా సాయిలు తీరు మారలేదు. గొడవలు పెరగడంతో భర్తను చంపాలని అతని భార్య అంజవ్వ పథకం వేసింది. మద్యం సేవించి నిద్రలో ఉన్న భర్త సాయిలును దోతితో మెడకు ఉరి బిగించి హత్య చేసింది. పోలీసులు ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. పూర్వపరాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ నిందితురాలికి జీవతఖైదుతోపాటు, రూ.2 వేల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసును సరైన పద్ధతిలో విచారించిన బిచ్కుంద సీఐలు కృష్ణ, నరేశ్‌కుమార్, ఎస్సైలు విజయ్‌కొండ, మురళి, మహేందర్, సిబ్బంది మురళీ కృష్ణ, రవిని ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

వాట్సాప్ మెసేజ్ వివాదాస్పదం

మోపాల్: మండలంలోని ఓ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు పదోతరగతి విద్యార్థినికి పంపిన వాట్సాప్ మెసేజ్ వివాదాస్పదంగా మారింది. రాత్రి సమయంలో విద్యార్థినికి మెసేజ్ పంపడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ గురువారం పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడిని నిలదీశారు. వాట్సాప్ మెసేజ్‌లు పంపడంపై తల్లిదండ్రులు మూడు రోజుల క్రితం హెచ్ఎంకు ఫిర్యాదు చేశారు. నాటి నుంచి ఆంగ్ల ఉపాధ్యాయుడు సెలవులో ఉండగా, తల్లిదండ్రులు ఎలాంటి చర్యలు తీసుకున్నారని హెచ్ఎంపై ఒత్తిడి తెస్తున్నారు.

ఈ క్రమంలో గురువారం సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు, యువకులు అక్కడికి చేరుకున్నారు. ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్‌ను లాక్కొని వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువురిని పీఎస్‌కు పిలిపించారు. దురుద్దేశంతో మెసేజ్‌లు చేయలేదని, మరోసారి మెసేజ్‌లు చేయనని చెప్పడంతో గొడవ సద్దుమణిగినట్లు తెలిసింది. కాగా ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్సై రమేశ్‌బాబు తెలిపారు.

యువకుడి అదృశ్యం



పురుషోత్తం(ఫైల్)

బాల్కొండ: మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన గున్నాల పురుషోత్తం అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు. పాలెం గ్రామానికి చెందిన పురుషోత్తం ఈ నెల 24న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. పురుషోత్తం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిక్లీలో ఒకరు..



వెంకట్

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన దండ్ల వెంకట్ అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ గురువారం తెలిపారు. ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లిన వెంకట్ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధురాలు ..



బత్తుల బాలవ్వ

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన బత్తుల బాలవ్వ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. బాలవ్వ కొన్నేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈనెల 23న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

సదాశివనగర్: మండలంలోని వజ్జపల్లిలో ఎక్సైజ్ పోలీసులు గురువారం గంజాయిని పట్టుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారం మేరకు వజ్జపల్లికి చెందిన రాజు అనే వ్యక్తి వద్ద వంద గ్రాములు, యాచారం తండాకు చెందిన తిరుపతి వద్ద 70 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ తెలిపారు.విచారణకొనసాగిస్తున్నట్లుపేర్కొన్నారు.

సంక్షిప్తం..

స.హ. చట్టంపై అవగాహన

ఎల్లారెడ్డి : స.హ. చట్టం ద్వారా అన్ని శాఖల్లోనూ వివరాలు పొందవచ్చని స.హ చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీం అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు.

జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

బాన్సువాడ రూరల్ : డిగ్రీ స్థాయిలో ఉన్నప్పుడే మంచి చెడులపై విచక్షణ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మానసిక వైద్య నిపుణులు, మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ విశాల్ విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాలలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ప్రజ్ఞ, సోషల్‌మీడియా, డ్రగ్స్ అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, ప్రిన్సిపల్ అరుణ్‌రెడ్డి, జీవన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భిక్కనూరు : విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలని జువాలజీ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్త డాక్టర్ కరుత పాండి అన్నారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సైన్స్‌సెమినార్ నిర్వహించారు. కళాశాలల విద్యార్థులకు క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులిచ్చారు.

బోధన మెళకువలపై శిక్షణ

కామారెడ్డి రూరల్ : అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల టీచర్ ట్రెనింగ్ ప్రోగ్రాంను నిర్వహించారు. భాగంగా మొదటి రోజు ఫిజికల్ సైన్స్ టీచర్లకు రెండవ రోజు బయో సైన్స్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు.

రేపు తుది ఓటర్ జాబితాను ప్రచురించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అన్ని జీపీల్లో కార్యాలయాలలో శనివారం గ్రామపంచాతీలకు సంబంధించిన తుది ఓటర్ జాబితాలను ప్రచురించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి సూచించారు.

ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండల విద్యావనరులకేంద్రంలో గురువారం ఇన్‌చార్జి ఎంఈవోగా మండలంలోని బొల్లారం హైస్కూల్ హెచ్ఎం భాస్కర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

మహిళలపై కేసునమోదు

బోధన్‌టౌన్: పట్టణంలో గంగవ్వ అనే మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేయడానికి యత్నించిన ఇద్దరు మహిళలపై పోలీసులు కేసునమోదు చేశారు. సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బండపల్లికి చెందిన గంగవ్వ బంధువులతో కలిసి పెళ్లి సామగ్రి కొనుగోలుకు బోధన్‌కు వచ్చింది. పనులు ముగించుకొని తిరిగి బాన్సువాడకు వెళ్లేందుకు బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా వెనకాలే ఉన్న మహిళలు గంగవ్వ మెడలో నుంచి గొలుసును బ్లేడ్‌తో కట్ చేస్తుండగా స్థానికులు గమనించి పట్టుకొని పీఎస్‌కు తరలించారు. మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హిందీ టీచర్ ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: మండలంలోని సంతోష్‌నగర్ తండాకు చెందిన ప్రమీల(40) అనే హిందీ టీచర్ గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ప్రమీలా స్థానిక కొత్తాబాది జెడ్పీహైస్కూల్‌లో ప్రభుత్వ హిందీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నా రు. ఆమె కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. విషయం తెలుసుకున్న బాన్సువాడ రూరల్, టౌన్ సీఐలు సత్యనారాయణగౌడ్, మండలి అశోక్‌లు సి బ్బందితో ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమీలా స్వగ్రామం బోధన్ మండలం ఊట్‌పల్లి కాగా ఆమె భర్త రవీంద్రనాయక్ నాగిరెడ్డిపేట్ మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరికి ఏడేళ్ల కుమార్తె ఉంది.బాన్సువాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ..

తాడ్వాయి: మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఫాతిమా బేగం(45) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. మహ్మద్ ఫాతిమా కొంత కాలంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు కామారెడ్డికి తరలించగా మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాడ్వాయిలో..



సాయవ్వ(ఫైల్)

తాడ్వాయి: ఆర్థిక ఇబ్బందులో ఓ వివాహిత ఆత్మహత్య చేసు కున్న ఘటన తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజివాడి గ్రామానికి చెందిన సాకలి సాయవ్వ(37) పెద్ద సాయిలు భార్యాభర్తలు. వీరు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. సాయిలు ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లినా ఆర్థిక ఇబ్బందులు తీరకపోవడంతో బుధవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఆ స్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.